క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

గోరంట్ల: మండల పరిధిలోని కొండాపురంలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి ఎమ్మెల్యే శంకర నారాయణ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథగుప్తా తెలిపారు.

నూతిలో పడిన లారీ



పాక్షికంగా దెబ్బతిన్న లారీ

పెనుకొండ రూరల్: తాడిపత్రి నుంచి తమిళనాడుకు నల్లబండ్ల లోడుతో వెళ్తున్న లారీ పెనుకొండ 44వ జాతీయ రహదారిపై అదుపుతప్పి నూతిలో పడిపోయింది. మండలంలోని గుట్టూరు సమీపంలో ఈ ఘటన జరగ్గా.. దాదాపుగా రూ.5 లక్షల నష్టం జరిగింది. లారీ ముందు భాగం పాక్షికంగా దెబ్బతినింది. ఈ ఘటనలో డ్రైవర్లు సురక్షితంగా బయటపడినట్లు తెలిపారు.

మహాసభ జయప్రదం చేయండి

పెనుకొండ: పుట్టపర్తిలో ఈనెల 13న నిర్వహించనున్న రజక సంఘం ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని రజక సంఘం నాయకులు కోరారు. సోమవారం పట్టణంలో రజక సంఘం నాయకులు మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు శ్రీరాములు, కదిరికి చెందిన ఆంజనేయులు, శీనా, నారాయణ, నరసింహులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి దారి చూపండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అగళి: మండల కేంద్రంలోని శనిమహత్మని ఆలయానికి వెళ్లేందుకు దారి కల్పించాలంటూ సోమవారం తహసీల్దార్ జాముసుల్లాఖాన్‌కు గ్రామస్తులు అర్జీ ఇచ్చారు. 50 సంవత్సరం నుంచి చెరువు కాలువ , నడకదారి ఉండేదని ప్రస్తుతం సమీప రైతులు ఆలయానికి వెళ్లేందుకు దారిలేకుండా చేస్తున్నారని వివరించారు. దేవస్థానానికి వెళ్లేందుకు దారి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్వో ప్లాంట్ల ప్రారంభం

లేపాక్షి: మండలంలోని నాయనిపల్లి క్రాస్ సమీపంలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సోమవారం ఆర్వో ప్లాంట్‌ను అభయ ఫౌండేషన్ ఫౌండర్ సుంకు బాలచందర్ ప్రారంభించారు.

హిందూపురం టౌన్: పట్టణంలోని కేజీబీవీలో సోమవారం అభయ ఫౌండేషన్ ఫౌండర్ సుంకు బాలచందర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

ప్రీ ఆడిట్‌తో అనవసర ఖర్చుకు చెక్



ప్రీ ఆడిట్ ఉత్తర్వులను కమిషనర్‌కు అందజేస్తున్న ఆడిట్ బృందం

హిందూపురం టౌన్: ముందస్తు ఆడిట్ ద్వారా పురపాలక సంఘంలో అనవసర ఖర్చులకు అడ్డుకట్ట వేయచ్చని జిల్లా ఆడిట్ అధికారి వెంకట శివారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ ఆఫీసులో ముందస్తు ఆడిట్‌ను ఆయన ప్రారంభించారు. కమిషనర్ ప్రమోద్‌కుమార్‌తో ఆడిట్ అధికారులు సమావేశమయ్యారు. జిల్లా ఆడిట్ అధికారి మాట్లాడుతూ పురపాలక సంఘాల్లో నిధుల దుర్వినియోగం కాకుండా, ఉన్న నిధులను సక్రమంగా వాడుకునే విధంగా చూడడం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందస్తు ఆడిట్ చేపట్టామన్నారు. లైసన్ అధికారి శోభన్‌రెడ్డి, జేపీఓ మనోహన్, జిల్లా నోడల్ అధికారి రాధిక, ఏపీఓ నరసింహమూర్తి, సీనియర్ ఆడిటర్ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

చుట్టపు చూపు ఎమ్మెల్యేగా బాలకృష్ణ

- 'పురం'లో పీఏలదే పెత్తనం
- నలిగిపోతున్న తెలుగు తమ్ముళ్లు



హిందూపురం అర్బన్: బాలకృష్ణ చుట్టపు చూపు ఎమ్మెల్యేగా మారారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యే బాలకృష్ణ తరచూ వచ్చి హడావుడి చేసి వెళ్లేవారు. అయితే అధికారం లేకపోవడంతో నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడటం లేదు. తప్పనిసరి కార్యక్రమాలు ఉంటే అలా వచ్చి ఇలా వెళ్లిపోతున్నారు. హిందూపురం రావడం అటు నుంచి అటే దేవనహళ్లి విమానాశ్రయానికి చేరుకొని హైదరాబాద్ వెళ్లడం పరిపాటిగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎమ్మెల్యే వచ్చినప్పుడే హడావుడి..

హిందూపురం తెలుగుదేశం పార్టీలోని కొంత మంది ముఖ్య నేతలు ఎమ్మెల్యే బాలకృష్ణ వచ్చినప్పుడు హడావుడి చేయడం తరువాత కనుమరుగవుతున్నారని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. పది నిమిషాలు ఫొటోలకు పోజులిచ్చి ఆ తర్వాత జారుకుంటున్నారని అంటున్నారు. పార్టీలోని కొందరు ముఖ్యనాయకులు తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్న అసంతృప్తితో ఉన్నా.. చేసేదిలేక పార్టీ కార్యక్రమాలకు హాజరవుతున్నట్లు బహిరంగంగానే చెబుతున్నారు.

ఒకరిద్దరికి మాత్రమే అవకాశం

పురానికి చుట్టపు చూపుగా వచ్చినప్పుడు కూడా ఎమ్మెల్యే బాలకృష్ణను కలిసే అవకాశం లేకుండా పోతోందని ఒకరిద్దరు ముఖ్య నేతలు తప్ప మిగిలిన వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే వచ్చారంటూ పూలహారాలు, బొకేలు తీసుకెళ్తున్నా కలిసే అవకాశం లేక వెనుక తిరగాల్సి వస్తోందని కార్యకర్తలు చెబుతున్నారు. దీంతో ఎమ్మెల్యే వచ్చారన్న సమాచారం తెలిసినా నాయకులు, కార్యకర్తలు అటు వైపు వెళ్లడం లేదు. కనీసం కలిసే అవకాశం లేనప్పుడు ఎందుకు వెళ్లాలని కొందరు తమ బాధను వెళ్లగక్కుతున్నారు.

అంతా పీఏల పాలనే...

ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురం నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడకపోవడంతో ఇక్కడ పీఏల పాలన కొనసాగుతోంది. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో బాలకృష్ణకు పీఏగా చిత్తూరు నుంచి వచ్చిన వ్యక్తి ఇక్కడున్న నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యేకు దూరం చేస్తూ వచ్చారని చెబుతున్నారు. నియోజకవర్గంలో ఏకఛత్రాధిపత్యంతో అందినకాడికి దోచుకున్నారన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకులే అతన్ని తరిమికొట్టారని అంటున్నారు. ఆ తర్వాత గుంటూరు నుంచి వచ్చిన పీఏతో పాటు బాలకృష్ణ వ్యక్తిగత పీఏ కూడా పురానికి సంబంధించిన అన్ని విషయాలను చూస్తున్నారని చెబుతున్నారు. వారు దిశానిర్దేశం చేస్తుండటం చాలా మంది నాయకులకు మింగుడు పడటం లేదు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి విలువ లేకుండా పోతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏవైనా సమస్యలు వస్తే పార్టీలో తామున్నామని అభయమిచ్చేవారు లేనప్పుడు ఎలా పనిచేయాలని తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలి



అమరాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

- సంక్షేమ ఫలాలు పక్కాగా అందుతున్నాయి
- ఎమ్మెల్యే తిప్పేస్వామితో ప్రజల హర్షం

అమరాపురం: 'ప్రభుత్వం అందిస్తున్న పథకాలన్నీ వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్నారు.. ఇంత కన్నా మాకు ఏం కావాలి? మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రిగా అవ్వాలి' అని తమ్మడేపల్లి రోడ్డులో ఉన్న ఇందిరమ్మ కాలనీ వాసులు ఎమ్మెల్యే తిప్పేస్వామికి తెలిపారు. సోమవారం స్థానిక అమరాపురం 1 గ్రామ సచివాలయంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అయ్యప్ప ఆలయం నుంచి బస్టాండ్ మీదుగా చోళామాంబదేవి ఆలయం వరకూ ప్రజలు పూలతో ఎమ్మెల్యే తిప్పేస్వామికి అడుగడుగునా నీరాజనం పలికారు. అనంతరం అమ్మవారికి పూజలు చేయించారు. అక్కడి నుంచి లింగాయత్ వీధి, ఉత్తర గొల్లహట్టి, ఇందిరమ్మ కాలనీలో ఎమ్మెల్యే గడప గడపకూ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరిస్తూనే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటికే అన్ని పథకాలు సక్రమంగా ఎలాంటి అవినీతికి తావు లేకుండా అందుతున్నాయని సిద్దగంగమ్మ, కెంచమ్మ, అన్నపూర్ణమ్మ, శారద, త్రివేణి, జ్యోతి, మంజుల, పార్వతమ్మ, శాంతమ్మ, శశికల తదితరులు తెలిపారు. జగనన్నే మరోసారి సీఎం కావాలనుకుంటున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయంలో పేదలకు దక్కాల్సిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలు పచ్చచొక్కాలకే పరిమితం అయ్యాయని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ ఫలాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, డైరెక్టర్లు అన్నపూర్ణమ్మ, గగన, లక్ష్మీదేవి, వీరక్యాతరాయప్ప, క్రిష్టియన్ ఫైనాన్స్ డైరెక్టర్ సుందర్‌రాజు, ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వైస్ ఎంపీపీ క్రిష్ణమూర్తి, లలితమ్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు చిక్కన్న, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయండి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, ఏడీసీసీ చైర్‌పర్సన్ లిఖిత

పెనుకొండ: నాడు- నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే శంకరనారాయణ ఎంఈఓలకు సూచించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓ చంద్రశేఖర్, ఎంఈఓ-2 సుధాకర్‌లు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం విద్యకు సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. ఉపాధ్యాయులు వేణుగోపాలచార్యులు, వెంకటశ్రీనివాసులు, ప్రభాకర్, నాగేంద్ర, రమేష్, బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఉద్యోగికి సన్మానం

రొద్దం: మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన నాగచంద్రను కార్యాలయ సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. అనంతరం పెనుకొండ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అతనికి రావాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ. ఐదు లక్షల చెక్కును ఎమ్మెల్యే శంకరనారాయణ, ఏడీసీసీ చైర్మన్ లిఖిత చేతుల మీదుగా అందజేశారు. పీఏసీఎస్‌లో నాగచంద్ర చేసిన సేవలను పలువురు కొనియాడారు.

సమస్యలు పరిష్కరించండి

పెనుకొండ: సమస్యలు పరిష్కరించాలని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు ఎమ్మెల్యే శంకర నారాయణకు సోమవారం క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. జిల్లాలోని అన్ని డిపోలలో సూపర్‌వైజర్లు, అధికారుల విధుల్లో డీపీటీఓ జోక్యం తగ్గించాలన్నారు. గ్యారేజీల్లో అవసరమైన పనిముట్లు తెప్పించి ఖాళీలను పూర్తి చేయాలి తదితర డిమాండ్లకు ఎమ్మెల్యేకు వివరించారు. జిల్లా కార్యదర్శి షబ్బీర్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

విధుల బహిష్కరణ

పెనుకొండ: పట్టణంలో సోమవారం న్యాయవాదులు తమ విధులను బహిష్కరించినట్లు స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. విజయవాడలో బాలగోపాల్, ఆదోనిలో శ్రీనివాసరెడ్డి. డోన్‌లో భాస్కర్‌నాయుడు అనే న్యాయవాదులపై ఇటీవల దాడులు జరిగినట్లు నేపథ్యంలో విధులు బహిష్కరించామన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

సోమందేపల్లి: మండల కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త హోటల్ సుభాన్ (55) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. ఉప సర్పంచ్ వేణు, మైనార్టీ నాయకులు ఇమామ్ వలి, యాడి కుళ్లాయప్ప తదితరులు సుభాన్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

నోటు పుస్తకాల పంపిణీ

పెనుకొండ: పట్టణంలోని నాలుగు మండల పరిషత్ పాఠశాల్లో సోమవారం చేయూత సేవ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు గూడూరు రమేష్ సతీమణి గూడూరు అరుణ చేతుల మీదుగా ఉచిత నోటు పుస్తకాలను అందజేశారు. దర్జీపేట, జీపీసీ కాలనీ, కుమ్మరదొడ్డి, ఉర్దూ పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు అందించారు.

టీడీపీ మైనార్టీల సమావేశం అట్టర్ ఫ్లాప్

- నామమాత్రంగా హాజరైన వైనం
- డుమ్మాకొట్టిన మాజీ ఎమ్మెల్యే ఈరన్న

మడకశిర: మడకశిరలో సోమవారం యాదవ కల్యాణ మంటపంలో నిర్వహించిన టీడీపీ జిల్లా స్థాయి మైనార్టీల ఆత్మీయ సమావేశం అట్టర్ ఫ్లాప్ అయింది. ఘర్ ఘర్‌కా నారా చంద్రబాబు హమారా కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్, రాష్ట్ర టీడీపీ మైనార్టీ అధ్యక్షుడు మౌలానా ముస్తాక్ అహమ్మద్, జిల్లా అధ్యక్షుడు పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తదితరులు హాజరయ్యారు. సమావేశానికి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది ముస్లింలు హాజరవుతారని టీడీపీ నాయకులు భావించారు. అయితే జిల్లా వ్యాప్తంగా నామమాత్రంగానే ముస్లింలు రాగా, అందులో కూడా టీడీపీ కార్యకర్తలు ఎక్కువ మంది ఉన్నారు. సమావేశానికి వచ్చిన కొందరు ముస్లింలు మాట్లాడుతూ సమావేశానికి బలవంతంగా హాజరయ్యామని, తమ గుండె నిండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఉన్నారని తెలిపారు. 99 శాతం ముస్లింలందరూ వైఎస్ జగన్ వెంటే ఉన్నామని స్పష్టం చేశారు. తమకు వైఎస్సార్ హయాంలో న్యాయం జరిగిందని, ప్రస్తుతం వైఎస్ జగన్ తమను ఆదుకుంటున్నారని తెలిపారు. ఇదిలా ఉండగా ఈ సమావేశం తుస్సుమనడంతో హాజరైన రాష్ట్ర, జిల్లా టీడీపీ నేతలు తీవ్ర అసహనానికి గురయ్యారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే ఈరన్నతో పాటు ఆయన వర్గీయులు కూడా ఈ సమావేశానికి డుమ్మా కొట్టారు.

నేడు సుబ్బరాయప్పస్వామి ఆరాధనోత్సవం



దండేపల్లిలో అవధూత సుబ్బరాయప్ప సమాధి



అవధూత సుబ్బరాయప్పస్వామి ఆలయం

రొద్దం: మండల పరిధిలోని దండేపల్లిలో సమాధి అయిన అవధూత సుబ్బరాయప్పస్వామి ఆరాధనోత్సవం నేడు జరగనుంది. మండల పరిధిలోని నల్లూరు, పెద్దమంతూరు, పి.రొప్పాల, దండేపల్లి, చిన్నమంతూరు, పెద్దకోడిపల్లి, తురకలాపట్నం తదితర గ్రామాల్లో సుబ్బరాయప్పస్వామికి పెద్ద ఎత్తున భక్తులు ఉన్నారు.

చెప్పినవి చెప్పినట్టుగా...

హిందూపురం మండలం దేవరకొత్తపల్లికి చెందిన అక్కమ్మ వెంకటప్ప దంపతుల కుమారుడు సుబ్బరాయప్ప. తండ్రి కుమ్మరి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. అప్పట్లో సుబ్బరాయప్పకు మతిస్థిమితం లేని వ్యక్తిలా గ్రామాల్లో తిరిగేవారట. అయితే ఎవరైన ఎదురుపడి పలకరిస్తే ఆ వ్యక్తికి జరిగే మంచి, చెడులను ముందుగానే తెలియజేసేవారని చెబుతున్నారు. గ్రామాల్లో గొర్రెలు, మేకలు, తప్పిపోతే సుబ్బరాయప్పను అడిగేవారంట. ఆయన ఫలానా వారు దొంగలించారని, పలనా చోట ఉన్నాయని చెబితే అవి నిజం అయ్యేవంటున్నారు. ఈ నేపథ్యంలోనే మండల పరిధిలోని దండేపల్లిలోనే మృతి చెందడంతో ఇక్కడే ఆలయాన్ని నిర్మించి ప్రతి ఏటా ఆరాధనోత్సవం నిర్వహిస్తున్నట్లు శిష్యుడు మురళి తెలిపారు. స్వామి పేరున సేవా కార్యక్రమాలను కూడా విస్తృతం చేస్తామన్నారు.

రైల్వే పనుల పరిశీలన



రైల్వే అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి నారాయణస్వామి

పావగడ: స్థానిక రాయదుర్గం - తుమకూరు రైల్వేలైన్ అభివృద్ధి పనులను కేంద్రమంత్రి ఏ నారాయణస్వామి, ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్, కేంద్ర రైల్వేశాఖ అధికారులు పరిశీలించారు. సోమవారం రాజవంతి సరిహద్దులో నిర్మాణ దశలో ఉన్న పనులను పరిశీలించారు. గతం లో రైల్వే టెండర్ రద్దు చేయడంతో నిలిచిపోయిన రైల్వేలైన్ పనులు రీటెండర్‌తో కొనసాగించేలా కేంద్ర రైల్వేశాఖ అధికారులు నిర్ణయించడంతో పనుల అభివృద్ధిని సమీక్షించారు. రైల్వేలైను నిర్మాణానికి రైతుల నుంచి ఇంకా భూ స్వాధీన ప్రక్రియ పూర్తి కాలేదని, వెంటనే మిగతా పనులు పూర్తి చేసి త్వరితగతిన రైల్వేలైను పనులు పూర్తి చేయాలని కేంద్ర మంత్రి నారాయణస్వామి, ఎమ్మెల్యే వెంకటేశ్ రైల్వే అధికారులకు సూచించారు.

డివిజన్ స్థాయిలో 'స్పందన'

- వివిధ సమస్యలపై 80 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ కార్తీక్

పరిగి: మండల కేంద్రంలో సోమవారం డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సబ్ కలెక్టర్ కార్తీక్‌కు మండల ప్రజలతో పాటూ రైతులు వినతిపత్రాలను అందించారు. మొత్తం 80 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దారు సౌజన్యలక్ష్మీ తెలిపారు. అందులో 35 రెవెన్యూ శాఖ, 28 హౌసింగ్ సంబంధించినవి కాగా మిగిలిన 17 అర్జీలు ఇతర శాఖలకు చెందినవని తెలిపారు. అర్జీల్లో కొన్ని ఇలా..

- పరిగి చెరువుకున్న మొదటి తూము నుండీ నీటిని విడుదల చేసి, చిన్నపల్లి, మూడిండ్లపల్లి, పైడేటి గ్రామాలతో పాటూ రొద్దం మండల గ్రామాలకు సాగునీటిని అందించడానికి చర్యలు చేపట్టాలని రైతులతో కలిసి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి, మండల మాజీ కన్వీనర్ జయరాం, చంద్రారెడ్డి తదితరులు వినతినందించారు.
- మండల కేంద్రంలో పాతబడి, శిథిలావస్థలో ఉన్న ఎస్సీ హాస్టల్ భవన ప్రాంగణంలో అంబేడ్కర్ భవన నిర్మాణంతో పాటూ హాస్టల్ భవనాన్ని పునరుద్ధరించేందుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మార్పీఎస్, దళిత సమాఖ్య నాయకులు రామాంజి, మద్దిలేటి, నారాయణ, మాజీ ఎంపీపీ గోవిందప్ప వినతిపత్రం అందించారు.
- జెడ్పీ స్కూలుకు వెళ్లే రోడ్డు ప్రక్కన కొందరు ఇష్టారాజ్యంగా మటన్ షాపులు నిర్వహిస్తుండటంతో దుర్వాసనతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మటన్ అమ్మకాలు ఈప్రాంతంలో నిషేధించాలని మైనార్టీ నాయకులతో కలిసి జిక్రియా ఖాన్ వినతినందించారు.
- పరిగిలో జాతీయ రహదారి విస్తరణలో ఇళ్లను కోల్పోయిన తమకు న్యాయం చేయాలని బాధితులు సబ్‌కలెక్టర్‌ను కలిసి వినతినందించారు.
- మండల కేంద్రంలో విలేకరులకు ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి స్థల కేటాయింపుతో పాటూ నిర్మాణానికి సహాయ సహకారాలు అందించాలని మండల విలేకరులు సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు.

బాధ్యతగా పనిచేయండి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తమరెడ్డి

చిలమత్తూరు: బాధ్యతగా పని చేయాలి... లేకపోతే వెళ్లిపోండని వైద్య సిబ్బందికి ఆస్పత్రి కమిటీ చైర్మన్ ఎంపీపీ పురుషోత్తమరెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన వైద్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఇటీవల వైద్యుల మధ్య సఖ్యత లేకపోవడంతో చెలరేగుతున్న గొడవల నేపథ్యంలో ఆయన సిబ్బందితో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. వైద్యుల తీరు ఆస్పత్రి పరువు తీసేలా ఉందని, గ్రూపులు కట్టి ఆస్పత్రిని భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. సమయానికి ఆస్పత్రికి రావాలని, స్థానికంగా ఉండాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రిలో ప్రైవేటు వ్యక్తులను ఎందుకు ప్రోత్సహిస్తున్నారని వైద్యాధికారి రామకృష్ణను ప్రశ్నించారు. ఇప్పటికైనా బాధ్యతగా పనిచేయాలని, లేకపోతే వేరే పీహెచ్‌సీలకు వెళ్లిపోవాలన్నారు.

సంక్షిప్త సమాచారం

శేఖర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

హిందూపురం అర్బన్: మండలంలోని అప్పలకుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శేఖర్‌రెడ్డి (58) అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వేణురెడ్డి, కిరికెర మూర్తి, నక్కలపల్లి శ్రీరామిరెడి, ఎంపీటీసీ కోఆప్షన్ మెంబర్ చాంద్‌బాషా, నరేంద్ర తదితరులు అప్పలకుంటకు వెళ్లి శేఖర్‌రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

తుకాల్లో తేడా రానివ్వొద్దు

రొళ్ల: గ్రామాలతో పాటు పట్టణాల్లో వివిధ వ్యాపారస్తులు నిత్యావసర సరులకు పంపిణీ చేసేప్పుడు తూకాల్లో తేడా రాకుండా చూసుకోవాలని హిందూపురం తూనికల కొలతలశాఖ అధికారి శివశంకర్ పేర్కొన్నారు. సోమవారం స్థాని లక్ష్మీనరసింహస్వామి కమ్యూనిటీ భవనం ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన యాజమానుల ఎలక్ట్రానిక్ మిషన్, త్రాసు, సీల్ వేసే కార్యక్రమం చేపట్టారు. శివశంకర్ మాట్లాడుతూ ఏడాదికి ఒకసారే స్కేళ్లను రిపేరీ చేయించుకుని సీల్ వేయించాలన్నారు.

రమేష్‌రెడ్డి సేవలు మరువలేం

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన నీలం రమేష్‌రెడ్డి కళాశాల అభ్యున్నతికి చేసిన సేవలు మరువలేనివని వక్తలు కొనియాడారు. కళాశాలలో సోమవారం రమేష్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జయప్ప, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, సాహితీ స్రవంతి వేదిక కన్వీనర్ హరి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని చిన్న చెరువు కట్ట మీద వెలసిన ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు నారాయణస్వామి రూ. 50 వేల విరాళం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆదిమూర్తి, క్రిష్టప్పలకు ఆ మొత్తాన్ని అందించారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

అమరాపురం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఎంపీపీ ఈరన్న ప్రిన్సిపాల్ పద్మావతికి సూచించారు. సోమవారం పాఠశాలను తనిఖీ చేశారు. ప్రహరీ పడిపోవడంతో విషపు పురుగులు సంచరిస్తున్నాయని, మరమత్తు చేయించాలని ప్రిన్సిపాల్ ఎంపీపీకి విన్నవించారు.

సీహెచ్‌ఓల పాత్ర ముఖ్యమైనది

హిందూపురం టౌన్: ప్రజారోగ్య పరిరక్షణలో సీహెచ్‌ఓల పాత్ర ఎంతో ముఖ్యమైనదని జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ రోహిల్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి కాన్ఫరెన్స్ హాలులో ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓల 8వ బ్యాచ్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు.

నిరసనాగ్రహం



సోమందేపల్లిలో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహిస్తున్న వలంటీర్లు

- వలంటీర్లపై పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై సర్వత్రా ఆగ్రహం
- బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్

సోమందేపల్లి: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం సోమందేపల్లిలో వలంటీర్లు శవయాత్ర నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ నుంచి గోరంట్ల బస్టాండ్ వరకు పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను ఊరేగించారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అశోక్, వైస్ సర్పంచ్ వేణు, సచివాలయ కన్వీనర్ ఇమామ్‌వలి, వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పరిగి: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్‌లో సోమవారం జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను వలంటీర్లు దహనం చేశారు. వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ డౌన్.. డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సచివాలయ మండల కన్వీనర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ చిత్తశుద్ధితో సేవలందిస్తున్న వలంటీర్లను కించపరిచే విధంగా మాట్లాడిన పవన్‌కు ప్రజలే బుద్ధిచెబుతారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శివశంకర్, సురేష్‌రెడ్డి, ఐటీ వింగ్ షబ్బీర్, రవూఫ్, రామాంజి, శంకరప్ప, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ క్షమాపణ చెప్పాలి

అమరాపురం: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వలంటీర్ల మీద చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎంపీపీ ఈరన్న తెలిపారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా నిస్వార్థంగా కేవలం గౌరవ వేతనంతో సంక్షేమ పథకాలను అందించడంలో కీలకంగా వ్యవహరిస్తున్న వలంటీర్లపై పవన్‌కళ్యాణ్ విమర్శలు చేయడం సరికాదన్నారు. స్వార్థ రాజకీయం కోసం వలంటీర్లపై చేసిన విమర్శలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.